క్లుప్తంగా

దాడి సంఘటనపై కేసు నమోదు

పాన్‌గల్: దూషించి దాడి చేసిన సంఘటనపై ఒకరిపై కేసు నమోదైన సంఘటన బుధవారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాసులు వివరాల ప్రకారం.. మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన పెబ్బేటి కుర్మన్న ఇంటి ముందు ఈనెల 18న గుర్తుతెలియని వ్యక్తులు కల్లు కవరును పెట్టి వెళ్లారు. ఈ విషయంపై 22న కుటుంబ సభ్యులు ఇంటి ముందు చర్చించుకుంటుండగా, ఇదే గ్రామానికి చెందిన సూర గోపాల్ తనను తిడుతున్నారని వారిపై కట్టెతో దాడి చేశాడు. దీంతో పెబ్బేటి కుర్మన్న ఎడమ కాళ్లు, కుడి చేయి భుజంపై గాయాలయ్యాయి. దీంతో బుధవారం పెబ్బేటి కుర్మన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు సూర గోపాల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఉపాధి పనులపై గ్రామసభ



పాన్‌గల్: మండల కేంద్రంలో ఉపాధిహామీ పనుల సామాజిక తనిఖీపై బుధవారం గ్రామ సభ నిర్వహించారు. గ్రామంలో 14వ విడత సామాజిక తనిఖీకి సంబంధించి ఏప్రిల్ 2023 నుంచి 31 మార్చి 2024 వరకు నిర్వహించిన ఉపాధి పనుల్లో రూ.72.87 లక్షలకు సంబంధించిన పనులపై, చేసిన ఖర్చుపై గ్రామసభలో చర్చించారు. అభ్యంతరాలు నమోదు చేసుకున్నట్లు సామాజిక తనిఖీ సిబ్బంది తెలిపారు. గురువారం అన్నారం, జమ్మాపూర్, రాయినిపల్లిలో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఏపీఓ కుర్మయ్య పేర్కొన్నారు.

పరీక్షలకు సిద్ధం కావాలి



పాన్‌గల్: పదో తరగతి విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా ప్రణాళిక బద్ధంగా పరీక్షలకు సిద్ధం కావాలని ఎంఈఓ శ్రీనివాసులు విద్యార్థులకు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయాన్ని ఆయన సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై పలు సూచనలు, సలహాలు చేశారు. లక్ష్యానికి అనుగుణంగా చదువుతూ ఉత్తమ ఫలితాలు సాధించాలని, సబ్జెక్టుల వారీగా గ్రూప్‌లుగా ఏర్పడి పరస్పర సహకారంతో చర్చించుకుంటూ పాఠ్యాంశాలు చదువుకోవాలన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

పాన్‌గల్: మండలంలోని మాందాపూర్ గ్రామానికి చెందిన 11 మంది లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బుధవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్‌సాగర్, కాంగ్రెస్ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష్మీదేవమ్మ, వారాల రాములు, ఈడిగ అరంజ్యోతి, కావలి శివ, తెలుగు మహేశ్వరి, కావలి అక్కమ్మ, హరిజన్ సుందరయ్య, హరిజన్ శాంతయ్య, దేవమ్మ, లోకేష్, హరిజన్ బీసమ్మలకు సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.2 లక్షల చెక్కులను అందజేసినట్లు తెలిపారు. చెక్కులు మంజూరు చేయించిన మంత్రి జూపల్లి, మంజూరుకు కృషి చేసిన మండల నాయకులకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోవర్ధన్‌సాగర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా బాలనాదం 80వ జయంతి



వనపర్తి టౌన్: జై భీమ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి రాష్ట్రం వెనుకబడిన కులాల హక్కుల పోరాట సమితి, జాతీయ మాలల ఐక్యవేదిక అధ్యక్షులు ఆవుల బాలనాదం 80వ జయంతి వేడుకలను జై భీమ్ స్వచ్ఛంద సేవా సంస్థ భవనంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి బాలనందం సోదరుడి కుమారుడు ఆవుల కురుమూర్తి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చెన్నకేశవులు, ఆనంద్, శ్రీకాంత్, గోవింద్, ఆంజనేయులు, వెంకటస్వామి, నాగేశ్వర్, శివశంకర్ ఉన్నారు.

కారు, బైక్ ఢీకొని.. ముగ్గురికి గాయాలు

వనపర్తి రూరల్: కారు, బైక్ ఢీకొని ముగ్గురికి గాయాలైన సంఘటన బుధవారం మండలంలోని రాజనగరం గ్రామశివారులో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. వనపర్తికి చెందిన బాలకృష్ణ, మహేష్, మరో వ్యక్తి బైక్‌పై వెళ్తున్నారు. రాజనగరం శివారులో బైక్‌ను కారు ఢీకొంది. దీంతో ఆ ముగ్గురికి గాయాలయ్యాయి. బాలకృష్ణను మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. మహేష్‌తో పాటు మరో వ్యక్తి వనపర్తి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని వనపర్తి రూరల్ ఎస్‌ఐ జలందర్‌రెడ్డి తెలిపారు.



అమరచింత చర్చిలో ప్రార్థనకు హాజరైన క్రైస్తవులు



వనపర్తిలోని టౌన్‌చర్చిలో దైవ ప్రసంగీకుడి సందేశం



మిరాసిపల్లి చర్చిలో కేక్ కట్ చేస్తున్న దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి

లోక రక్షకుడు ఏసయ్య

- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు, కేక్ కటింగ్
- ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, శ్రీహరి శుభాకాంక్షలు
- ఘనంగా క్రిస్మస్ వేడుకలు

సాక్షి, నెట్‌వర్క్: ప్రేమ, దయ, శాంతి, సహనం కలిగి ఉండే సుగుణాలే ఏసుక్రీస్తు మార్గమని, అందుకే క్రిస్మస్ మానవతా విలువలకు నిదర్శనమని కల్వరి టౌన్ చర్చి, ఎంబీ ఒలియో చర్చి దైవ ప్రసంగీకులు జాన్‌రాజు, జాన్‌లు ఉద్బోధించారు. జిల్లాలోని క్రైస్తవులు బుధవారం క్రిస్మస్ వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కల్వరి టౌన్ చర్చి ఆధ్వర్యంలో ఎంసీహెచ్ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. గాంధీనగర్‌లోని టౌన్‌చర్చి, మిషన్ కాంపౌడ్‌లోగల ఎంబీ వోలీవ చర్చి, ఇందిరాకాలనీలో బెతేస్థ, శ్వేతనగర్‌లోని హెబ్రోన్ ప్రార్థన మందిరాల్లో క్రైస్తవుల ప్రార్థన చేశారు. ఓలీవ చర్చిలో సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంబీ ఒలియో, కల్వరిటౌన్ చర్చి, ఆయా చర్చిల బాధ్యులు, నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

- వనపర్తి మండలంలోని చిమనగుంటపల్లి, నాచహల్లి, కిష్టగిరి, అప్పాయిపల్లితో పాటు పలు గ్రామాల చర్చిలలో క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. పత్యేక ప్రార్థనలు నిర్వహించి కేక్ కట్ చేశారు. వారికి పలు పార్టీల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.
- కొత్తకోట మండలంలోని మిరాసిపల్లిలో దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి కేక్‌కట్ చేసి క్రిస్టియన్ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.
- కొత్తకోట పట్టణంలోని చర్చిఆఫ్ క్రైస్ట్ ప్రార్థన మందిరంలో పాస్టర్ వై.నథానియల్ క్రీస్తు జన్మదిన సందేశం అందించారు. అనంతరం క్రైస్తవ సామాజిక పరిరక్షణ వేదిక రాష్ట్ర అధ్యక్షులు జనంపల్లి షిమియాసోన్‌తో కలిసి కేక్ కట్ చేశారు. వేడుకల్లో జేపీ పాల్, జేడీ శాంతిప్రసాద్, సుజ్ఞానం, రాజు, విలియం, రవి కుమార్, మార్క్‌తో పాటు క్రైస్తవులు పాల్గొన్నారు.
- ఆత్మకూర్ మండలంలో ఆత్మకూర్, మూలమల్ల, రేచింతల, ఖానాపూర్, పిన్నంచర్ల, తూంపల్లి, జూరాలలోని చర్చిలో పాస్టర్లు ప్రత్యేక సందేశం ఇచ్చారు. మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి కేక్‌కట్ చేసి క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.
- ఏసు క్రీస్తు అనుసరించిన మార్గం మానవజాతికి ఆచరణీయమని మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. అమరచింత పట్టణంలోని ఎంబీ కర్మేల్ చర్చి, నాగల్‌కడ్మూర్, సింగంపేట గ్రామాల్లో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని కేక్‌కట్ చేసి పండుగ శుభాకాంక్షలను తెలిపారు.
- పాన్‌గల్ మండల కేంద్రంలోని చర్చిలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి అమర్‌కుమార్ కేక్‌కట్ చేశారు. వెంగళాయిపల్లి, మాందాపూర్, గోప్లాపూర్, రేమద్దుల, కేతేపల్లి గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు.
- మదనాపురం మండలంలో మదనాపురం, దుప్పల్లి, కొన్నూరు, నర్సింపురం, కొత్తపల్లి, రామన్‌పాడు, తిర్మలయపల్లి, అజ్జకొల్లు, గోపన్‌పేట లో క్రిస్మస్ పండుగ నిర్వహించారు.
- ఉమ్మడి గోపాల్‌పేట మండలంలో, తాడిపర్తి, గొల్లపల్లి, చీర్కపల్లి, రేవల్లి, పొలికెపాడు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కేక్‌కటింగ్ చేసి స్వీట్లు పంచారు.



కల్వరిటౌన్ చర్చిలో ప్రార్థనలకు హాజరైన క్రైస్తవులు



ఒలియె చర్చిలో క్రీస్తు సందేశం వింటున్న క్రైస్తవులు



గోపన్‌పేటలో కేక్ కట్ చేస్తున్న క్రైస్తవులు



మదనాపురంలో క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న క్రైస్తవులు



ఆత్మకూర్ చర్చిలో ప్రార్థనకు హాజరైన క్రైస్తవులు



కొత్తకోట చర్చి ఆఫ్ క్రైస్ట్ ప్రార్థన మందిరంలో కేక్ కట్ చేస్తున్న పాస్టర్, తదితరులు



వనపర్తిలో క్రిస్మస్ శుభాకాంక్షలు చెప్పుకుంటున్న యువతులు



చీర్కపల్లిలో ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు



వనపర్తిలో కేక్ తినిపిస్తున్న కాంగ్రెస్ నాయకులు



మూలమల్ల చర్చిలో ప్రార్థనకు హాజరైన క్రైస్తవులు

ఇచ్చిన హామీలు అమలు చేయాలి



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న ఎండీ.జబ్బార్

పాన్‌గల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎండీ.జబ్బార్ అన్నారు. బుధవారం మండలంలోని రేమద్దులలో వివిధ ప్రజాసంఘాలు, వ్య.కా.స, రైతు సంఘాల ఆధ్వర్యంలో గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలను ఆయన పార్టీ మండల కార్యదర్శి బాల్యానాయక్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీల అమల్లో విఫలమైనట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్న ఇచ్చిన ఆరు గ్యారంటీలలో మిగిలిన వాటిని అమలు చేయడంలో జాప్యంతో ప్రజలు, కార్మికులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన విమర్శించారు. గ్రామాల్లో సమస్యలు పరిష్కారం కాకనే పార్టీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఎదుట్ల నుంచి వయా రేమద్దుల గ్రామం మీదుగా సింగాయిపల్లి వరకు డబుల్ రోడ్డును పూర్తి చేయాలని, రేమద్దుల–కాశీంనగర్, తిర్మలాపూర్, మండల కేంద్రం వరకు ఉన్న రోడ్లను పూర్తి చేయాలన్నారు. అంతకుముందు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా వాజ్‌పేయి శత జయంతి

సాక్షి, నెట్‌వర్క్: భారత మాజీ ప్రధాని మంత్రి, భారతరత్న అటల్‌బిహారీ వాజ్‌పేయి శత జయంతి వేడుకలను వనపర్తి పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఆస్పత్రిలో వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం యువ మోర్చా ఆధ్వర్యంలో అయ్యప్ప దేవాలయ పరిసర ప్రాంతాల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమం చేప ట్టారు. కార్యక్రమంలో సబ్బిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఆర్ లోక్‌నాథ్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, శ్రీశైలం, కుమారస్వామి, సీతారాములు, మణివర్ధన్ పాల్గొన్నారు.

- ఖిల్లాఘనపురం మండల కేంద్రంలోని బస్టాండు దగ్గర మాజీ ప్రధాన మంత్రి వాజ్‌పేయి జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేశారు.



వనపర్తి జిల్లా ఆస్పత్రిలో వాజ్‌పేయికి నివాళులర్పిస్తున్న నాయకులు

- అమరచింత పట్టణంలో బీజేపీ జెండా కట్ట వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆస్పత్రులలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు.

బలిజపల్లి గ్రామాన్ని విలీనం చేయొద్దు



బలిజపల్లిలో రిలే నిరాహార దీక్షలో మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ జయంతి

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని బలిజపల్లి గ్రామాన్ని జంగమాయపల్లి గ్రామంలో విలీనం చేసేందుకు అధికారులు తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఎత్తివేయాలని, లేనియెడల నిరసన దీక్ష చేపడతామని బలిజపల్లి గ్రామ మాజీ సర్పంచ్ జయంతి అన్నారు. 'వీలినం వద్దు గ్రామ పంచాయతీ కావాలి' అంటూ గ్రామస్తులు, మహిళలు చేస్తున్న రిలే నిరాహాదీక్ష బుధవారం మూడో రోజుకు చేరింది. గ్రామస్తులకు మద్దతుగా మాజీ సర్పంచ్ జయంతి దీక్షలో పాల్గొని మాట్లాడారు. విలీన నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకుని రెండు గ్రామాల అభివృద్ధికి సహకరించాలన్నారు. కొన్నేళ్లుగా బలిజపల్లికి ఒక గుర్తింపు ఉందని, నూతన గ్రామ పంచాయతీ ఏర్పడ్డాక ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. జంగమయ్యపల్లిలో విలీనం చేస్తే సహించేది లేదని, ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. ప్రభుత్వం విలీనం ఆలోచన ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో గిరిజ. సత్య శిలారెడ్డి. శశివర్ధన్‌రెడ్డి. సంజీవరెడ్డి. నాగరాజు పాల్గొన్నారు.

విస్తరణకు మోక్షమెప్పుడో?

- ఇరుకుగా కొత్తకోట–మదనాపురం రోడ్డు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- స్పందించని అధికారులు, ప్రజాప్రతినిధులు

కొత్తకోట: కొత్తకోట–మదనాపురం రహదారి విస్తరణకు నోచుకోకపోవడంతో ఇరుకు రోడ్డుతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎన్నో ఏళ్లుగా రోడ్డు వెడల్పు చేయాలని ప్రజల నుంచి వినతులు వస్తున్నా అవి ప్రతిపాదనల వరకే పరిమితమవుతున్నాయి. దీంతో పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతూ వస్తోంది. కొత్తకోట చౌరస్తా నుంచి మదనాపురం వెళ్లే రోడ్డు ఇరుకుగా ఉండటంతో వాహనదారులు ఆ రోడ్డు వైపు వెళ్లాలంటే నరకయాతన పడాల్సి వస్తోంది. ఒక భారీ వాహనం దారిలో వస్తే గంటల తరబడి ట్రాఫిక్‌లో వాహనదారులు ఇరుక్కుపోతున్నాయి. చాలా సార్లు రోడ్డు వెడల్పు కోసం మున్సిపాలిటీలో తీర్మానాలు చేసి ఉన్నతాధికారులు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా లాభం లేకపోయింది. ఆత్మకూర్, అమరచింత, మక్తల్ తదితర ప్రాంతాల నుంచి వచ్చే చెరకు ట్రాక్టర్లు, లారీలు సైతం ఈ రహదారిలోనే వెళ్లాల్సి వస్తోంది. చెరకు వాహనాలు వచ్చాయంటే ఇంకా ట్రాఫిక్ జామే. కొత్తకోట బైపాస్ పక్కన వేసిన సర్వీస్ రోడ్డును పునరుద్ధరించి చెరకు ట్రాక్టర్లను ఆ సర్వీస్ రోడ్డపై మళ్లిస్తే కొంత వరకు ట్రాఫిక్ సమస్య తీరుతుందని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ప్రజాప్రతినిధులు స్పందించాలి..

రోడ్డు విస్తరణపై ఎమ్మెల్యే, ఎంపీలు స్పందించాలి. ప్రతిరోజు ఆత్మకూర్, అజ్జకొల్లు, చర్లపల్లి, నారాయణపేట, మరికల్, దేవరకద్ర తదితర ప్రాంతాలకు మదనాపురం రోడ్డు గుండా బస్సులు వెళ్తుంటాయి. ఈ క్రమంలో మదనాపురంలో రోడ్డులో ఇరువైపుల ద్విచక్రవాహనాలు, ఆటోలు నిలపడంతో ఇటుఅటు వెళ్లే వాహనాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.



కొత్తకోట చౌరస్తా ముఖచిత్రం

పోలీసులకు ప్రధాన సమస్య ట్రాఫికే..

కొత్తకోట పట్టణంలో రోడ్లు ఇరుకుగా ఉండటంతో పోలీసులకు ట్రాఫిక్ ప్రధాన సమస్యగా మారింది. రోడ్డు వెడల్పు లేకపోవడం వల్ల నిత్యం వాహనదారులతో పోలీసులు కుస్తీ పడుతున్నారు. పట్టణ కూడలిలో నాలుగు రహదారులు కన్పించేలా పోలీసులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను పరిశీలిస్తున్నారు. ఇరుకు రోడ్ల వల్ల ట్రాఫిక్ నియంత్రం చేయడానికి పోలీసులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్యలు శాశ్వతంగా పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డుకు అడ్డంగా వాహనాలు ఆపితే చర్యలు



పట్టణంలోని నాలుగు రోడ్లకు ఇరువైపులా అడ్డంగా వాహనాలు ఆపితే జరిమానా విధించడం జరుగుతుంది. ప్రతి రోజు ట్రాఫిక్ కానిస్టేబుల్ ద్వారా ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు కృషి చేస్తున్నాం. మున్సిపల్ అధికారులు సహకరిస్తే రోడ్డు పక్కన చిరువ్యాపారులను వేరే ప్రాంతానికి తరలిస్తే బాగుంటుంది. భారీ వాహనాలు వచ్చినప్పుడు కాస్త ఇబ్బందిగా ఉంటుంది. అయినా ట్రాఫిక్ ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూస్తున్నాం. ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలి.

– బి.ఆనంద్, ఎస్‌ఐ, కొత్తకోట



కొత్తకోట పట్టణంలో ఇరుకుగా ఉన్న మదనాపురం రోడ్డు

ట్రాఫిక్‌తో రోజు ఇబ్బంది



కొత్తకోటలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉండటంతో ద్విచక్ర వాహనంపై ప్రయాణించాలన్నా ఇబ్బందిగా ఉంది. పెద్ద వాహనాలు వచ్చినప్పుడల్లా గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. ముఖ్యంగా మదనాపురం రోడ్డును విస్తరించి ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపాలి.

– గోపాల్, ఉపాధ్యాయుడు, కొత్తకోట

రోడ్డు విస్తరణ చేపట్టాలి



ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తక్షణమే కొత్తకోట–మదనాపురం రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలి. వెంటనే బైపాస్‌లోని సర్వీస్ రోడ్డును బాగుచేయాలి. చెరకు ట్రాక్టర్లను పట్టణంలోకి రాకుండా బైపాస్ నుంచే వెళ్లేలా చర్యలు తీసుకోవాలి. కొత్తకోటలో షాపుల ఎదుట పార్కింగ్ స్థలాలు ఉండేలా చూడాలి.

– లాల్‌కోట రవి, కొత్తకోట